

కోతకు వచ్చి నిగనిగలాడుతున్న కొత్తిమీర



మడులలో పెరుగుతున్న గోంగూర

ఊరంతా.. ఆకుకూరల సాగే..

కుటుంబం అంతా సాగులోనే.. | లాభసాటిగా వ్యవసాయం | ఏడాది పొడవునా ఆదాయం

ఆ గ్రామాల్లో అడుగు పెడితే పచ్చదనం తివాచీ పరిచి, స్వాగతిస్తున్నట్లు ఉంటుంది. కనుచూపు మేర ఎక్కడ చూసినా పచ్చదనమే కనిపించడంతో ఆహ్లాదకరంగా అనిపిస్తుంది. ఆకుకూరలు, కూరగాయలను సాగు చేస్తూ నేలతల్లినే నమ్ముకున్న ఆ ఊరి రైతుల జీవితమూ పచ్చగా, నిశ్చింతగా సాగిపోతోంది. కుటుంబమంతా కష్టపడి పని చేస్తూ, వ్యవసాయాన్ని లాభసాటిగా మలచుకోవడం 'శ్రమయేవ జయతే' అన్నదానికి సార్థకతగా కనిపిస్తుంది. ఆ రైతుల జీవనం స్ఫూర్తిదాయకం.. ఆదర్శనీయం..

చిన్న కమతాలతో నిత్యం ఆదాయం

ఈ ఆరు గ్రామాల్లో రైతులు తమకు గల భూమిని చిన్న కమతాలుగా విడగొట్టి మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి సాగు చేస్తారు. 30 నుంచి 45 రోజులలో దిగుబడి వచ్చే ఆకుకూరలతో ఈ గ్రామాలు నిత్యం ఆకుపచ్చగా ఉంటాయి. కూరగాయలు 4 నుంచి 6 నెలల వరకు దిగుబడి ఇస్తాయి. ఒక పంట తీసిన తరువాత పంటమార్పిడి ద్వారా తరువాత ఆదాయం వచ్చే వాటిని ఎంపిక చేసుకుంటారు. ఇలా ఈ గ్రామాలలో నిత్యం ఆదాయం కురిపించే తెల్ల తోటకూర, గోంగూర, మెంతికూర, కొత్తమీర, చిక్కుడు, కాకర, పొట్ల, వంకాయ, పాలకూర, దొండ, బెండ, ఆనప, బీర, ఉల్లి పండిస్తుంటారు. మడులు, పంటలను బట్టి మార్కెట్‌కు వెళితే ఆ రోజు కనీస ఆదాయం రూ.1000 నుంచి రూ.3000 ఉండేలా ప్లాన్ చేసుకుంటారు.

తగరపువలస: ఆనందపురం మండలం సాగుకు పెట్టింది పేరు. ఇక్కడ వరి, మొక్కజొన్న తరువాత ఎక్కువ మంది పండించేది పువ్వులు, కూరగాయలే. ప్రతి పంచాయతీలో కనీసం సగం మంది రైతులు పంటలపై ఆధారపడి జీవిస్తున్నారు.

ఆకు కూరలు..కూరగాయల సాగు

ముచ్చర్ల, తంగుడిబిల్లి, వేమగొట్టిపాలెం, గిడిజాల, కణమాం, తర్లువాడ తదితర గ్రామాల రైతులు నూరుశాతం ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తున్నారు. సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాది పొడవునా వీటిని సాగు చేస్తూ మార్కెటింగ్ చేసుకుంటున్నారు. అతివృష్టి, అనావృష్టి సమయంలో తప్ప వీరు ఆకుకూరలు, కూరగాయల సాగును వదిలిపెట్టరు. కూలీలపై ఆధారపడకుండా మడులు సిద్ధం చేసుకునే సమయం నుంచి దిగుబడి, మార్కెటింగ్ పనులు అన్నీ వారే చూసుకుంటారు. సాగులో తమ కుటుంబ సభ్యుల అవసరం అంతగా లేనప్పుడు మిగిలిన వారు మాత్రం కూలిపనులకు వెళ్లిపోతుంటారు. ఎప్పుడో తప్పితే వీరికి ఈ సాగులో నష్టాలు రావు. డిమాండ్‌కు అనుగుణంగా ఆయా నెలల్లో ఆయా రకాలు సాగు చేస్తూ వ్యవసాయాన్ని లాభదాయకం చేసుకుంటున్నారు.



మండలంలో ప్రత్యేకంగా సాగవుతున్న తెల్ల తోటకూర

బీర, చిలగడదుంపల సాగు

మండలంలోని తర్లువాడ పంచాయతీ బీర, చిలకడ దుంపల సాగుకు పెట్టింది పేరు. ఇక్కడ రైతులంతా కూడబలుక్కున్నట్టు వీటినే సాగు చేస్తారు. తరువాత బొప్పాయికి ప్రాధాన్యం ఇస్తారు. వీటిలో చిలకడ దుంపలను పద్మనాభం మండలం, విజయనగరం, ఏజెన్సీ, ఒడిశాలో రైతులతో వరి ధాన్యం కోసం వస్తుమార్పిడి చేసుకుంటారు. కొండవాలు ప్రాంతాలలోని రైతులు మాత్రం జీడి, మామిడి, నీలగిరి, సరుగుడు, కొబ్బరి తదితర తోటపంటలను నమ్ముకొని ఉపాధి పొందుతుంటారు.

వ్యవసాయమే సర్వస్వం



మాకు వ్యవసాయమే సర్వస్వం. ఉన్న అర ఎకరాన్ని విభజించి ఏడాది పొడవునా రకరకాల ఆకుకూరలు, కాయగూరలు వేస్తాం. మా గ్రామంలో అందరం రైతులమే. సీజన్ బట్టి మార్చి వీటిని పండిస్తాం. ఆనందపురం, పెందుర్తి మార్కెట్‌లకు వీటిని తరలిస్తాం. ఇక్కడి రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకుంటారు.

– కోండ్రోతు కోటి, వేమగొట్టిపాలెం.

ఒకరి వద్ద పని చేయక్కర్లేదు



మాకు 30 సెంట్లు ఉంది. ఇందులో నాతో పాటు వృద్ధులైన తల్లిదండ్రులు కూడా చీకటితోనే వ్యవసాయానికి వస్తారు. మడులు సిద్ధం చేయడం, గొప్పులు తవ్వడం, నీరు పెట్టడం, మందులు కొట్టడం చేస్తాం. కూరలు మార్కెట్‌కు తీసుకువెళ్లి విక్రయించడం వలన కనీసం రూ.1000 వస్తుంది. ఒకరి వద్ద పనిచేసే కంటే భూమిని నమ్ముకుంటే మేలు.

– దండు పైడిరాజు, గిడిజాల

ఉల్లి మోసుకు మంచి డిమాండ్



ఇక్కడి రైతులు నిత్యం డిమాండ్ ఉండే ఆకుకూరలు ఎక్కువగా సాగు చేస్తారు. మాకు ఉన్న 40 సెంట్లలో ఎక్కువగా ఉల్లి సాగు చేస్తాం. ఉల్లిపాయలు దిగుబడి కంటే వీటి మోసు అమ్మితే ఎక్కువ లాభం. పాయ రాకుండా కాడలతో కట్టలు కట్టి రూ.200 వంతున అమ్ముతాం. వీటికి హోటళ్ల నుంచి ఎక్కువ డిమాండ్ ఉంటుంది.

– కోరాడ సన్యాసిరావు, గిడిజాల



మసాలా కూరలకు ప్రత్యేకంగా ఉల్లి సాగు

క్లుప్తంగా

మహాలక్ష్మి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

భీమునిపట్నం: భీమిలిలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. ముందుగా వేకువజామున సుప్రభాత సేవ, హోమం, ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం అర్చకులు అప్పలాచార్య ఆధ్వర్యంలో మహాలక్ష్మి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

15న దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట

తగరపువలస: భీమిలి మండలం కొత్త మూలకుద్దులో ఈ నెల 15న శ్రీలక్ష్మి గణపతి, సుబ్రహ్మణ్య సమేత త్రిశక్తి దేవాలయ విగ్రహ ప్రతిష్ట చేస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ప్రతిష్టాపనోత్సవాల్లో భాగంగా గురువారం విశేష పూజలు, హోమాలు నిర్వహించామన్నారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం శనివారం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్న సమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలియజేశారు.

ఘనంగా ల్యాబ్ టెక్నీషియన్ల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న ప్రధాన వైద్యుడు ఫణికుమార్, ల్యాబ్ సిబ్బంది

భీమునిపట్నం: భీమిలి సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ల్యాబ్ టెక్నీషియన్ల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాన వైద్యుడు ఫణికుమార్ మాట్లాడుతూ ఇక్కడి ల్యాబ్‌లో ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని, వాటి ద్వారా అనేక పరీక్షలు త్వరగా జరుగుతున్నాయని తెలిపారు. హెచ్‌ఐవీ, టీబీ పరీక్షలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సదుపాయాలను అందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ల్యాబ్ సిబ్బంది రవికుమార్, మాధవరావు, జయలక్ష్మి, మాధవి, నారాయణ, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

పాలిథిన్ వినియోగంపై విద్యార్థుల చర్చ



చర్చలో పాల్గొన్న విద్యార్థులు

తగరపువలస: చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా 'సింగిల్ యూజ్ పాలిథిన్ వినియోగం లాభమా..నష్టమా' అంశంపై విద్యార్థులకు గురువారం చర్చ నిర్వహించారు. ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు నష్టాలే ఎక్కువగా ప్రస్తావించారు. పాలిథిన్ వినియోగం వలన కాలుష్యం పెరుగుతుందని, మైక్రో ప్లాస్టిక్స్ ఆహారం ద్వారా మన శరీరంలో ప్రవేశించడం వలన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ప్రిన్సిపాల్ తెలిపారు. కాగితం, జ్యూట్ బ్యాగుల తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో భాగంగా ర్యాలీ, పోస్టర్ తయారీ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మహిళల నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు మారికవలస ఆర్‌జీకే కాలనీలో అపారిశుధ్యం పేరుకుపోయినా పట్టించుకోవడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరుపై గురువారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ నివాసాలకు ఉన్న పైపులైన్లు పగిలిపోయి, యూజీడీ వ్యవస్థ మ్యాన్‌హోల్స్ బ్లాక్ అయిపోవడంతో మురుగునీరు పారకుండా నివాసాల చెంతనే నిల్వ ఉండిపోతుందని తెలిపారు. ఈ కారణంగా ఈగలు, దోమలతో వ్యాధులకు గురవుతున్నామన్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. అధికారుల చర్యలు చేపట్టకపోతే జ్వరాల రిపోర్టులతో వచ్చి జోనల్ ఆఫీసు వద్ద ధర్నా చేస్తామన్నారు.

మంచినీటి అక్రమ రవాణాకు చెక్

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురంలో మంచినీటి అక్రమ రవాణాను అధికారులు అడ్డుకున్నారు. ఇక్కడి నుంచి భారీ ట్యాంకర్ల ద్వారా అనధికారికంగా నీరు రవాణా చేస్తున్నట్లు స్థానికులు తహసీల్దారు పైలా రామారావుకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు మంచినీటిని అక్రమంగా తరలిస్తున్న ట్యాంకర్‌ను వీఆర్వో గోపీకృష్ణ పట్టుకున్నారు. వాహనాన్ని భీమిలి తహసీల్దారు కార్యాలయానికి తరలించి సీజ్ చేశారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పటికే ఈ ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో ఈ ప్రాంతాల్లో అన్ని చోట్ల ఉప్పునీరు పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు భారీ ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించడం వలన భవిష్యత్తులో తాగేందుకు నీరు దొరకదని, నీటిని అక్రమంగా తరలించి, వ్యాపారం చేస్తున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఇక్కడివారు డిమాండ్ చేస్తున్నారు.



వాటర్ ట్యాంకర్‌ను సీజ్ చేసిన అధికారులు

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



ఫౌండేషన్ అందించిన పరీక్ష సామగ్రితో విద్యార్థులు

భీమునిపట్నం: భీమిలిలోని నెహ్రూ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ గురువారం పరీక్ష సామగ్రిని సమకూర్చింది. ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ ఇక్కడ చదువుతున్న 80 మంది విద్యార్థులకు పరీక్ష అట్టలు, కంపాస్ బాక్స్‌లు, పెన్నులు, స్కేళ్లు అందించారు. ఆయన మాట్లాడుతూ శ్రద్ధగా చదువుకుని, అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులకు పరీక్ష కిట్లు అందిస్తున్న ఏడుకొండలు, సరస్వతి దంపతులు

చిట్టివలస హైస్కూల్ విద్యార్థులకు..

తగరపువలస: చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్‌లో 10వ తరగతికి చెందిన 55 మంది విద్యార్థినులకు కట్టమూరి ఆనంద్ సేవాట్రస్ట్ ద్వారా పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయిని సీహెచ్ రోజామణి ఆధ్వర్యంలో ట్రస్ట్ ప్రతినిధులు ఏడుకొండలు, సరస్వతి వీటిని విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. గత నెలలో జరిగిన పాఠశాల శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉపాధ్యాయులను సత్కరించాల్సి ఉన్నా ఎమ్మెల్సీ కోడ్ వల్ల సాధ్యం కాకపోవడంతో, గురువారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గాడు అప్పలనాయుడు, మైలిపల్లి లక్ష్మణరావు మాట్లాడుతూ ఎంతో ఘనంగా జరిగిన ఉత్సవాల్లో పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను సత్కరించలేకపోయామని, ఇప్పుడు వారిని సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ముఖ్య సభ్యులు పూసర్ల శ్రీనివాస్, కాళ్ల సన్నీ, మైలిపల్లి షణ్ముఖరావు, రాజేటి బసవ కృష్ణమూర్తి, మరోజు గోపి, ఎం.ముత్యాలరావు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ

ప్రజా గాయకుడు 'పందిరి'కి నివాళి

మధురవాడ: ప్రజా గాయకుడు పందిరి రాము మృతికి పలువురు సంతాపం తెలిపారు. రాము అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందడంతో, గురువారం శివశక్తి నగర్‌లోని ఆయన నివాసం వద్ద మృతదేహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం శ్రేణులు, వివిధ సంఘాలు నాయకులు వచ్చి ఆయన మృత దేహంపై ఎర్రజెండా కప్పి, అంజలి ఘటించారు. సీపీఎం నాయకునిగా, ప్రజా గాయకుడిగా చేసిన సేవలు కొనియాడారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు, గుర్రం రమణ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజ శర్మ, మధురవాడ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు తదితరులున్నారు.

అన్ని రంగాల్లో కృత్రిమ మేధ కీలకం

తగరపువలస: ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) అన్ని రంగాల్లో ప్రముఖపాత్ర పోషిస్తోందని నగరానికి చెందిన ప్రాస్పెక్ట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో సుధాకర్ పంతుల అన్నారు. చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జరిగిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ బియాండ్, ఇన్నోవేటివ్-ఎక్స్ 2కె25 హ్యాకథాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమస్యలను తెలుసుకుని పరిష్కారం చూపేలా ప్రయత్నించాలన్నారు. అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠ్యాంశాలతో పాటు ప్రయోగశాల పరిజ్ఞానం కీలకమన్నారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల నుంచి వచ్చిన 850 మంది విద్యార్థులు 120 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ది డిజిఫెక్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు అమల్‌రాజ్, ఇన్‌స్ప్రెడ్ ఐటీ సొల్యూషన్స్ వైస్ ప్రెసిడెంట్ శ్రీచరణ్, ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న ముత్తంశెట్టి

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: ఆనందపురం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా ఆనందపురం, వేములవలస, ఎల్‌వీ పాలెం, ఈగలవానిపాలెం, పాలవలస, గుడిలోవ, బాకూరుపాలెం, ఐటీబీపీ, పందలపాక, పొడుగుపాలెం, చందక, కుసులవాడ, గొట్టిపల్లి, జగన్నాధపురం, వెంకటాపురం, గిడిజాల, బాకూరుపాలెం, మిందివానిపాలెం, గుమ్మడివానిపాలెం తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వైభవంగా బంగారమ్మ ఆలయ వార్షికోత్సవం

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీ గ్రామదేవత బంగారమ్మ ఆలయ వార్షికోత్సవం జరిగింది. అమ్మవారిని ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కవయిత్రి మొల్లకు నివాళులు



తాటితూరు కుమ్మరివీధిలో మొల్లమాంబకు నివాళులర్పిస్తున్న శాలివాహనులు

తగరపువలస: 16వ శతాబ్దపు ప్రముఖ తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతిని సంతపేట శాలివాహన యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సంతపేట, పద్మనాభం మండలం అనంతవరం, పాండ్రంగి, కొవ్వాడ పంచాయతీలలో జరిగిన వేడుకలలో పొట్నూరు రామచంద్రరావు, జామి అప్పలరాజు, అమలాపురం అప్పలసత్యం, పొట్నూరు ఏసుబాబు, తాటిపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అర్చకుడు మేకా శంకరశర్మ మొల్లమాంబ చిత్రపటానికి పూజలు చేశారు.

- తాటితూరులో శాలివాహన యువజన సంఘం ఆధ్వర్యంలో తొలి తెలుగు కవయిత్రి మొల్ల 585వ జయంతి నిర్వహించారు. పంచాయితీ వార్డు సభ్యురాలు తాటిపూడి తారకేశ్వరి, సంఘం ప్రధాన కార్యదర్శి తాటిపూడి త్రినాథ్, సభ్యులు పాల్గొన్నారు.

కబేళా సంత సమస్య పరిష్కారానికి చర్యలు

పశు సంవర్థక శాఖ జేడీ రామకృష్ణ



రైతులు, మటన్ వ్యాపారులతో మాట్లాడుతున్న పశుసంవర్థక శాఖ జేడీ రామకృష్ణ, కిషోర్

మధురవాడ: కబేళా సంత సమస్య పరిష్కారానికి అన్ని మార్గాలు అన్వేషిస్తున్నామని పశుసంవర్థక శాఖ జేడీ రామకృష్ణ, వెటర్నరీ అధికారి కిషోర్, ఐఎస్‌డీపీ ఇన్‌చార్జి శ్రీనివాస్ తెలిపారు. కొమ్మాది ఓజోన్ వ్యాలీ రోడ్డులో మారికవలస వద్ద గల కబేళాకు సంబంధించిన మేకలు, గొర్రెల సంత సమస్య పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాల మేరకు వారు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సమస్య పరిష్కారంలో అధికారులు చేస్తున్న తాత్సారంపై సాక్షి పత్రికలో ప్రచురితమవుతున్న కథనాలు, మటన్ వ్యాపారుల ఫిర్యాదులపై అధికారులు స్పందించారు. ఇందులో భాగంగా ఇక్కడ జీవాలు ఉంచే ప్రదేశాన్ని పరిశీలించి రైతులు, మటన్ వ్యాపారుల సంఘం ప్రతినిధులతో మాట్లాడారు. వారు మాట్లాడుతూ ఏడున్నరేళ్లుగా ఆశీలు కట్టి జీవాలను ఉంచుతున్న స్టాక్ పాయింట్‌ను అర్ధంతరంగా ఖాళీ చేయించడమే కాకుండా, సదరు నిర్వాహకులు బెదిరింపులు, దాడులకు దిగుతున్నారని అధికారుల వద్ద వాపోయారు. గతంలో కబేళా లోపల విశాలంగా ఉన్న స్థలం ఇచ్చి, తర్వాత తగ్గించేయడంతో లోపల జీవాలు ఉంచే పరిస్థితి లేదన్నారు. ప్రస్తుతం ఉన్నచోటే జీవాలను ఉంచేందుకు 10 రోజుల పాటు సమయం ఇవ్వాలని రైతులు, మటన్ వ్యాపారుల తరఫున విశాఖ నూర్ బాషా ముస్లిం సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులు షేక్ బృహాన్, షేక్ నాగూర్, షేక్ రహిమాన్ తదితరులు కోరారు. తమకు స్థలం కేటాయించి, వసతులు, రక్షణ కల్పిస్తే ఇతరులకు చెల్లించే ఆశీలు ప్రభుత్వానికే చెల్లిస్తామన్నారు.

కలెక్టర్‌కు నివేదిక

సంత ఏర్పాటు, స్థలం కేటాయింపు, కబేళా నిర్వాహకులు ఎంత స్థలం కేటాయిస్తారు? కబేళా లోపలే స్థలం కేటాయించే అంశాలు పరిశీలించి, కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని అధికారులు తెలిపారు. వాస్తవానికి సంత లేదా స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కబేళా నిర్వాహకులకే ఉంది. అయినా వీరు ఆ బాధ్యతను పక్కన పెట్టి ఇరువురు వ్యక్తుల మధ్య గొడవను చూస్తూ కాలయాపన చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కనీస నిబంధనలు పాటించని కబేళా నిర్వాహకులపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు లక్ష్మీ అమ్మవారి జయంతి

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మీ దేవాలయంలో శుక్రవారం లక్ష్మీ అమ్మవారి జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు తెలిపారు. తెల్లవారు జామున 4 గంటలకు సుప్రభాత సేవ, 4.30 గంటలకు అష్టలక్ష్మీ హోమం, ఉదయం 8 గంటలకు లక్ష్మీ నారాయణులకు అభిషేకం ఉంటుందని ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి తెలియజేశారు. సాయంత్రం 5.30 గంటలకు సామూహిక కుంకుమార్చనలు, 6.30 గంటలకు శ్రీ అష్టలక్ష్మీ అమ్మవారికి సహస్ర దీపాలంకరణ సేవ, 7 గంటలకు సువర్ణ పుష్పార్చన, 7.30 గంటలకు పుష్పాభిషేకం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మొగదారమ్మ ఆలయంలో..

సాగర్‌నగర్‌లోని మొగదారమ్మ మహాలక్ష్మి ఆలయంలో లక్ష్మీ అమ్మవారి జయంతి నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. పంచామృతాభిషేకం, సహస్ర బిల్వ దళార్చన, శ్రీలక్ష్మీ పౌండ్రిక యాగం పుష్పాభిషేకం నిర్వహిస్తామని తెలియజేశారు.

ఇస్కాన్‌లో గౌర పూర్ణిమ ఉత్సవాలు నేడు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో శుక్రవారం గౌర పూర్ణిమ ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ ప్రకటనలో తెలిపారు. గౌర పూర్ణిమను శ్రీ కృష్ణభగవానుని భక్త అవతారమైన శ్రీ చైతన్య మహా ప్రభు ఆవిర్భావ దినోత్సవంగా నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటల నుంచి ఉత్సవాలు ప్రారంభం అవుతాయని, శ్రీ కృష్ణుని భజన సంకీర్తనలు, పుష్పాభిషేకం నిర్వహిస్తామని తెలియజేశారు.

హరేకృష్ణ వైకుంఠంలో ఏర్పాట్లు

తగరపువలస: గౌరపూర్ణిమను పురస్కరించుకుని గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద శుక్రవారం సాయంత్రం నిర్వహించే శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు జయంతికి హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. సంస్థ ప్రతినిధి అంబరీష దాస మాట్లాడుతూ సాయంత్రం 6.30 గంటలకు శ్రీకృష్ణ బలరాములకు అభిషేకాలు, 7.30 గంటలకు గౌర లీలపై ప్రవచనాలు, 8.15 గంటలకు మహా మంగళహారతి, సంకీర్తన, తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. భక్తులంతా పాల్గొనాలని, వివరాలకు 95425 11108లో సంప్రదించాలని కోరారు.



హరేకృష్ణ వైకుంఠంలోని శ్రీరాధా మదన్ మోహనులు

పీఎంఏవై అసంపూర్తి ఇళ్లకు ప్రభుత్వ ప్రోత్సాహం

పద్మనాభం: పీఎంఏవై అసంపూర్తి ఇళ్లకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ఏఈ పద్మజ తెలిపారు. మండలంలోని తునివలస లేఅవుట్‌లో అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన పీఎంఏవై ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం అందించనున్న ప్రోత్సాహంపై ఆమె అవగాహన కల్పించారు. ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకునేందుకు ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75వేలు చొప్పున ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. 2024 డిసెంబర్ పదో తేదీ వరకు పునాదుల నుంచి శ్లాబ్ వరకు నిర్మించి వదిలేసిన పీఎంఏవై గృహ నిర్మాణ పథకం లబ్ధిదారులకు ఇది వర్తిస్తుందన్నారు. గతంలో మంజూరు చేసిన రూ.1.80 లక్షలకు ఇది అదనంగా ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ పాల్గొన్నారు.

18న పీఎఫ్ పెన్షనర్ల ఆందోళన

తగరపువలస: మద్రిపాలెంలోని పీఎఫ్ కార్యాలయం ముందు ఈ నెల 18న తలపెట్టిన ఆందోళనకు పెన్షనర్లు తరలిరావాలని చిట్టివలస పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కానూరి రాంబాబు, దామోదర బాబాజీ కోరారు. చిట్టివలస లేబర్ వెల్ఫేర్ సెంటర్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో వీరు మాట్లాడారు. పెన్షనర్లు అంతా ఒకటేనని ప్రభుత్వం మాత్రం 1995, 2014 వేర్వేరుగా చూపిస్తోందని అన్నారు. సమావేశంలో సహాయ కార్యదర్శి మొర అప్పలరాజు, కోశాధికారి పంపాన సూర్యనారాయణ, సింగిడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.